నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 VIKARABAD




గోడౌన్‌కు వేసిన సీల్‌ను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ఈవీఎం గోడౌన్ పరిశీలన

వికారాబాద్, ఫిబ్రవరి 4 : జిల్లా కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీల్‌ను పరిశీలించి, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ అలీ, సంబంధిత అధికారులు ఉన్నారు.

# సర్కారు కండ్లు తెరవట్లే..

**వివిధ రంగాల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. పట్టించుకోని ప్రభుత్వం**

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రాఘవేంద్రనగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 4: వివిధ రంగాలకు చెందిన వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోతున్నా.. ప్రభుత్వం కండ్లు తెరవకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో రైతులు, బిల్డర్స్, ఆటో డ్రైవర్లు అనేక రంగాల వారు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని, సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు జఠిలంగా మారాయన్నారు. కనీసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలైనా త్వరగా నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, మాజీ ప్రజాప్రతినిధులు దుర్గ, లావణ్య, పద్మ, భూపాల్‌రెడ్డి, బీరప్ప బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# బొద్దింకలు.. కుళ్లిన కూరగాయలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే నారాయణగూడలోని ఇండియన్ దర్బార్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటగదిలో అపరిశుభ్రమైన వాతావరణం, బొద్దింకల బెడద ఉన్నట్లు గుర్తించారు. కుళ్లిన టమాట, పచ్చిమిర్చి, క్యారెట్లు, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు తేల్చారు. లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకలోనూ అధికారులు తనిఖీలు చేపట్టగా, వంటగది గోడలు అపరిశుభ్రంగా ఉండడం, దుర్వాసన వస్తుండడాన్ని గమనించారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.





*జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. త్వరలోనే ఎన్నికలు జరుగుతాయన్న ప్రభుత్వ ప్రకటనతో గ్రామాల్లోని ఆశావహుల్లో హడావిడి మొదలైంది. కాగా, జిల్లాలో 531 గ్రామపంచాయతీలుండగా.. మొత్తం ఓటర్లు 7,63,665 మంది ఉన్నారు. వార్డులు 4710 ఉండగా.. 4,724 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. అయితే రిజర్వేషన్లపైనే ఉత్కంఠ నెలకొన్నది.*

*- రంగారెడ్డి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)*



# పల్లెపోరు సందడి

**త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలంటూ ప్రభుత్వ ప్రకటన**

- ఆశావహుల్లో మొదలైన హడావిడి
- రిజర్వేషన్లపైనే ఉత్కంఠ
- పాత వాటిని కొనసాగిస్తారా..? లేదా మారుతాయా..? కరువైన స్పష్టత
- రంగారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీలు 531
- మొత్తం ఓటర్లు 7,63,665 మంది
- వార్డులు 4710, పోలింగ్‌స్టేషన్లు 4,724

త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్న ప్రభుత్వ ప్రకటనతో పల్లెల్లో కోలాహలం నెలకొన్నది. ఆశావహులు ఇప్పటికే గ్రామాలకు చేరుకుని తమ కార్యక్రమాలను మొదలెట్టారు. అయితే రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో వారిలో అయోమయం నెలకొన్నది. గతంలో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయా..? లేక మారుతాయా..? అన్న అంశంపైనే చర్చ జరుగుతున్నది. కులగణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లు ఉంటాయని పలువురు భావిస్తున్నారు. కాగా, జిల్లాలో ని ఏ గ్రామంలో చూసినా పంచాయతీ ఎన్నికలపైనే చర్చ జరుగుతున్నది.

### జిల్లాలో 531 గ్రామ పంచాయతీలు..

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు పోగా ప్రస్తుతం జిల్లాలో 531 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లా శివారు ప్రాంతాలతోపాటు కొత్తూరు, షాద్‌నగర్, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్లాయి. కొత్తగా చేవెళ్ల, షాద్‌నగర్‌లు మున్సిపాలిటీలుగా మారడంతో జిల్లాలో 19 మండలాలే మిగిలాయి. ఈ 19 మండలాల్లో 531 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ గ్రామాల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### రిజర్వేషన్లపైనే ఉత్కంఠ..

రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ఆశావహుల్లో అయోమయం నెలకొన్నది. కులగణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లు ప్రకటిస్తారా..? లేదా గతంలో ఉన్న రిజర్వేషన్లనే కొనసాగిస్తారా..? అన్న అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. ఎన్నికల బరిలో ఉండేం దుకు సిద్ధమైన ఆశావహులు ఇప్పటికే గ్రామాల్లో తమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరి నెలాఖరులో లేదా మార్చిలో జరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల హడావిడి ఊపందుకున్నది.

| జిల్లాలో | |
|---|---|
| గ్రామ పంచాయతీలు | 531 |
| వార్డులు | 4,710 |
| పోలింగ్‌స్టేషన్లు | 4,724 |
| మొత్తం ఓటర్లు | 7,63,665 |

### సర్వం సిద్ధం..



పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే 4710 వార్డులు, పోలింగ్ స్టేషన్లనూ గుర్తించాం. జిల్లాలో 7,63,665 మంది ఓటర్లుండగా..4,724 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నాం. ఓటర్లకు అందుబాటులో ఉండేలా వాటిని ఏర్పాటు చేస్తాం.

-సురేశ్‌మోహన్, డీపీవో రంగారెడ్డి

# నిర్బంధకాండ

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి పిలుపు
- ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌ల అరెస్టులు
- అప్పులు చేసి పల్లెల్లో పనులు చేపట్టామని ఆవేదన
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం





పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచ్‌లు జగన్, వెంకటయ్య తదితరులు

*పల్లెల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే సర్పంచ్‌లు.. అప్పులు చేసి మరీ మురుగు కాల్వల నిర్మాణం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, వీధుల్లో సీసీ రోడ్లు తదితర పనులను చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ పల్లెల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం దక్కడంలేదు. దీంతో కొందరు మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యకు సైతం పాల్పడ్డారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా పోలీసులు అరెస్టులు చేశారు. కొందరినీ హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పల్లెల్లో పనులు చేపట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయామని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*



దోమలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

### పరిగి మండలంలో..

పరిగి : అసెంబ్లీ ముట్టడికి మంగళవారం బయలుదేరిన రాఘవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నల్క జగన్, చిగురాల్‌పల్లి మాజీ సర్పంచ్ వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకుడు బాలయ్యలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా పెండింగ్ బిల్లులను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

### మర్పల్లి మండలంలో..

మర్పల్లి : చలో అసెంబ్లీకి తరలిన మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి మర్పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాచయ్య, యూత్ అధ్యక్షుడు మధుకర్, పీర్యానాయక్ తదితరులు ఉన్నారు.

### పూడూరు మండలంలో..

పూడూరు : అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న మండలంలోని మాజీ సర్పంచ్‌లు బుచ్చన్న, భాస్కర్‌రెడ్డి, వీరన్న, సత్యనారాయణ, వినోద్, ఖదీర్, సదానందం గౌడ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అప్పులు చేసి పనులు చేయించామని, తమకు రావాల్సిన డబ్బులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దోమ మండలంలో..

దోమ : దోమ సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు వెళ్లవద్దని ఏఎస్ఐ చారి ఆయనకు సూచించారు. నిరసన తెలిపేందుకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. సర్పంచ్‌లంతా పల్లెల్లో పనులు చేపట్టి అప్పులపాలయ్యారని వాపోయారు.





బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన మర్పల్లి పోలీసులు





# నేడు స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

**10 నుంచి 17వరకు నామినేషన్ల స్వీకరణ**

**18న పరిశీలన, 21న ఉపసంహరణ, 25న ఎన్నికలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నేడు నోటిఫికేషన్ జారీ కానున్నది. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఈ మేరకు మంగళవారం బల్దియా షెడ్యూల్ వివరాలను వెల్లడించింది. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో ఇద్దరు కార్పొరేటర్లు చనిపోగా.. మరో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. 146 మంది కార్పొరేటర్లు 15 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ నెల 10 నుంచి 17 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఆదివారం (16వ తేదీ మినహా) మిగిలిన రోజుల్లో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఔత్సాహికులు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు. 18న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ, ఆదే రోజు బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటనను అధికారులు విడుదల చేయనున్నారు. ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్, కౌంటింగ్ మూడు గంటల తర్వాత ఉండనుందని పేర్కొన్నారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతున్నదని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులకు బీఆర్ఎస్ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఈ సారి ఎన్నికల ఏడాది కావడంతో ఎన్నికలు జరుగుతాయా? ఏకగ్రీవం అవుతుందా? అనేది ఉత్కంఠగా మారింది.